ప్రజాశక్తి

ఆదివారం 17 ఆగస్టు 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

వీధులు జలమయం



విశాఖ నగరంలో జోరువానలోనే సాగుతున్న ప్రయాణాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, తగరపువలస
విశాఖ జిల్లాలో శనివారం పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల తరువాత మరింత ఎక్కువైంది. రోజంతా చల్లనిగాలులు వీచాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, అక్కయ్యపాలెం, మాధవధార, ఎన్ఎడి జంక్షన్, తగరపువలస ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు సాగించారు. కొంతకాలంగా వర్షాభావం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనంగా మారిందనే చెప్పాలి. చల్లగాలులతో కాసింత సేదతీరారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో ఈ వర్షం పట్ల భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

అప్రమత్తంగా ఉండండి

ఎంవిపి.కాలనీ: భారీవర్షాల నేపథ్యంలో మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ అన్ని విభాగాలు అప్రమత్తంతగా ఉండాలని అధికారులను ఆదేశించినట్టు జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారత వాతావరణశాఖ, అమరావతి వాతావరణ కేంద్రం సమాచారం మేరకు రాష్ట్రంలో వర్షాలు అధికంగా కురుస్తున్నాయని, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విశాఖ నగరంలో భారీవర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ఇప్పటికే జివిఎంసి ముందస్తు చర్యలను చేపట్టిందన్నారు. కొండవాలు, లోతట్టు, మురికివాడల ప్రజలకు రక్షణ కల్పించే దిశగా శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి నగరంలో పటిష్టమైన సామాజిక భవనాలు, పాఠశాల భవనాలను మిగతా 2లో..

గుండె శస్త్ర చికిత్సలు పున: ప్రారంభం

కెజిహెచ్‌లో ఎట్టకేలకు అందుబాటులోకి అధునాతమైన మిషన్లు



శస్త్ర చికిత్స విజయవంతమైన బోడపాటి మావుళ్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కెజిహెచ్‌లోని కార్డియాలజీ విభాగంలో ఎట్టకేలకు నూతన మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. గుండె శస్త్ర చికిత్సలు శనివారం నుంచి పున: ప్రారంభమయ్యాయి. దీంతో గుండె జబ్బులతో బాధపడే రోగుల కష్టాలు తీరనున్నాయి. గడిచిన ఆరు నెలలుగా ఇక్కడ కార్డియో సర్జరీలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఎంతో మంది ఇబ్బందులు పడ్డారు. శనివారం నుంచి అందుబాటులోకి వచ్చిన నూతన మిషన్ల పనితీరును ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సిఎస్ఆర్ ఎంఒ డాక్టర్ యు.శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్ రాధాకృష్ణ పరిశీలించి గుండె ఆపరేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వాస్తవానికి కార్డియాలజీ విభాగంలో పూర్తి స్థాయిలో నూతన మిషన్లు అందుబాటులోకి రావాలంటే ఒక్కో మిషన్‌కు రూ.2.50 కోట్లు వరకూ ఖర్చు కానుంది. ఈ క్రమంలో రోగుల అవసరాల దృష్ట్యా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి కలెక్టర్‌తో చర్చించి, రోగులకు ఇబ్బంది లేకుండా అద్దె ప్రాతిపదికను మిషన్లు ఏర్పాటు చేశారు. వాటికి ట్రయల్స్ నిర్వహించి అధికారికంగా శనివారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. కార్డియాలజీ వైద్యుల పర్యవేక్షణలో యధావిధిగానే రోగులకు అవసరమైన శస్త్రచికిత్సలు చేపట్టినట్టు వాణి తెలిపారు. సాధారణంగా నెలకు 30 నుంచి 40 శస్త్రచికిత్సలు చేయనున్నామని, భవిష్యత్తులో ఇబ్బంది లేకుండా ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

శస్త్రచికిత్స విజయవంతం

కెజిహెచ్ సిటివిఎస్ విభాగంలో, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బోడపాటి మావుళ్లుకు శనివారం అధునాతన హార్ట్-లంగ్ మెషిన్, టెంపరేచర్ కంట్రోల్ మెషీన్ సహాయంతో ఓపెన్‌హార్ట్ సర్జరీ విజయవంతంగా మిగతా 2లో..

వార్త మెయిన్‌లో..

వరుస విజయాలతో అమరావతి రాయల్స్ దూకుడు



షాట్ కొడుతున్న హనుమ విహారి

సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై ఘనవిజయం

ఎస్ఐఆర్ రద్దుకు వామపక్షాల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల ఓటు హక్కు ఖూనీని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆపాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ బీహార్‌లో ఎన్నికల కమిషన్ 65 లక్షల ఓట్లను తొలగించడం, ఆధార్ కార్డు, ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఓటర్ గుర్తింపు కార్డు చెల్లుబాటు కావని చెప్పడం, ఓటరే తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాలని చెప్పడం ప్రజాస్వామ్యాన్ని హరించడమేనన్నారు. ఇసి జారీ చేసిన ఓటర్ గుర్తింపు కార్డుతో దశాబ్దాలుగా ఓట్లు వేస్తున్న వారికి, ఇప్పుడు ఆ గుర్తింపు కార్డు చెల్లుబాటు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

అత్యవసర ఆశ్రయాలుగా సిద్ధం చేసామని, నగరంలో డ్రైనేజీ లైన్లు, మేన్‌హోల్స్ , అధికంగా నీరు పారే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడమైనదని ,త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా , అలాగే నీటి కాలుష్యం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయడం , కూలిన, విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

శిథిలావస్థలోనున్న హోర్డింగులను గుర్తించి తొలగించే ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండేందుకు జివిఎంసి వాహనాలు, జనరేటర్లను చెట్లను తొలగించే యంత్రాలను, జెసిబిలను, ట్రక్కులను, సమాచార రేడియో హ్యాండ్ సెట్‌లను, తదితర అవసరమగు పరికరాలను సిద్ధం చేయాలని, అలాగే జోనల్, సచివాలయ పరిధిలో గల అధికారులను, ఉద్యోగులను, సిబ్బందిని రక్షణ చర్యలు దిశగా సిద్ధంగా ఉండాలని జీవీఎంసీ అధికారులకు, ఇంజనీర్లకు, జోనల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. అత్యవసర సహాయం కోసం జివిఎంసి కంట్రోల్ రూమ్ లో టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009కు సంప్రదించాలని, సూచించారు.

గుండె శస్త్ర చికిత్సలు పున: ప్రారంభం

నిర్వహించబడిందని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మీడియాకు తెలిపారు. ఈ అధునాతన మెషిష్ ద్వారా ఇకనుండి గుండె శస్త్రచికిత్సలు నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ మనిత, డాక్టర్ సతీష్, స్టాఫ్‌నర్స్ భవాని ఇతర సిబ్బంది సేవలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, సిఎస్ఆర్ఎంఓ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ యు. శ్రీహరి, అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ అభినందించారు. ఈ అదునాతన శస్త్రచికిత్స అందుబాటులోకి తీసుకురావడానికి సహకారం అందించిన ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ హరేంధీరప్రసాద్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఐఆర్ రద్దుకు వామపక్షాల ధర్నా

కాదని ఇసి ప్రకటించడం సరికాదన్నారు. ఈ అక్రమ నిబంధనలు, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, తొలగించిన ఓటర్ల జాబితాను వెంటనే ప్రకటించాలని, పౌరులందరికీ ఓటు హక్కును కల్పించాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ బెంగుళూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధి మహదేవ్ శాసనసభ నియోజకవర్గంలో బిజెపి ఓట్ల చోరీకి పాల్పడిందని, తాము ఎంచుకున్న కొన్ని నియోజకవర్గాల్లో, లక్షల సంఖ్యలో మూకుమ్మడి ఓట్లు చేర్పించి ఎన్నికల ఫలితాలను తనకు అనుకూలంగా మార్చుకుంటోందని, ఓట్ల చోరీకి పాల్పడుతోందని పార్లమెంటు ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రకటించారని, ఆధారాలు బయటపెట్టారని తెలిపారు. వీటిపై పూర్తి దర్యాప్తు జరిపించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌కు ఉందన్నారు. కానీ ఇసి దీనికి భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాజ్యాంగ వ్యవస్థలన్నింటిపైనా దాడి చేయడం, దుర్వినియోగం చేయడం, ఇడి, సిబిఐలను తన రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోవడం తీవ్రం చేసిందన్నారు. ఎన్నికల వ్యవస్థను తనకు అనుకూలంగా మార్చుకొని దేశంలో ప్రజాస్వామ్యాన్ని బిజెపి ఖూనీ చేస్తోందని విమర్శించారు. ఆర్‌ఎస్ఎస్ లక్ష్యం ప్రకారం దేశంలో అధ్యక్ష తరహా పాలనకు అర్రులు చాస్తోందని దుయ్యబట్టారు. ప్రజలు ప్రజాస్వామ్యం, సార్వత్రిక ఓటు హక్కు రక్షణకు నడుం బిగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, బి.ఈశ్వరమ్మ, ఎం.సుబ్బారావు, క్షేత్రపాల్ రెడ్డి, ఎం.మన్మధరావు, ఎం.రాంబాబు, కె.వనజాక్షి, ఎస్.జ్యోతీశ్వరరావు, కెఎం.కుమార మంగళం, కె.నాగభూషణం పాల్గొన్నారు.

నేడు 'పాఠ్యాంశాలు మార్చినంత మాత్రాన సత్యం మారిపోతుందా' సదస్సు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు 'పాఠ్యాంశాలు మార్చినంత మాత్రాన సత్యం మారిపోతుందా' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌చార్జి జి.ఎస్.రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో ముఖ్య వక్తలుగా ఆంధ్రా యూనివర్సిటీ హిస్టరీ డిపార్ట్మెంట్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ కె. సూర్యనారాయణ, పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు.

ఉక్కు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌లో 4వేల మంది కాంట్రాక్టు కార్మికులను అన్యాయంగా తొలగించారని ముందస్తు నోటీసు ఇవ్వకుండా తీసివేయడం తగదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వికుమార్ ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శనివారం కార్మికసంఘాలు చేపట్టిన దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములు కోల్పోయిన డిపిలను ల్యాండ్ లూజర్స్‌ని కూడా మేనేజ్‌మెంట్ తొలగించిందని, ఇది అన్యాయం అన్నారు. గాజువాక ఎమ్మెల్యే, విశాఖ ఎంపీలకు ఈ అన్యాయాలు కనిపించడం లేదని, మిట్టల్ ఒక్కడే కళ్ళకి కనిపిస్తున్నాడని ఆరోపించారు. ఓటువేసి గెలిపించిన కార్మికులకు అన్యాయం జరిగిందని తెలిసినా, పల్లెత్తు మాట రావటం లేదన్నారు.కాంట్రాక్టు కార్మికులను అందరినీ పనిలోకి తీసుకోవాలని డిమాడ్ చేసారు. కార్యక్రమంలో ఎం.జగ్గునాయుడు, బొట్టా ఈశ్వరమ్మ, బి.జగన్, పి.మణి, ఒ.అప్పారావు,ఉరుకూటి రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పొట్టగొట్టే చర్యలు !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగర అభివృద్ధికి దోహదపడే కార్మికవర్గం నిత్యం సమస్యల వలయంలో కూరుకుపోతోంది. వారిని వీధుల్లోకి నెట్టి వారి పొట్టగొట్టే విధానాలతో 'కూటమి' పాలకులు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి రాజకీయ వాతావరణంలో కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కుటుంబాలతో అనిశ్చిత జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కాలంగా చూస్తే విశాఖ ఉక్కు పరిశ్రమలోనూ, తాజాగా విశాఖ డెయిరీలోనూ కార్మికుల జీవనం అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతోంది. పోరాటాలే మార్గంగా కార్మికులు ముందుకు సాగుతున్నారు. పారిశ్రామిక నగరంగా కీర్తి ప్రతిష్టలున్న విశాఖలో వేల సంఖ్యలో కార్మిక కుటుంబాలు తమ హక్కుల కోసం తీవ్ర స్థాయిలో వేదనకు గురౌతుండడం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

అడ్డగోలు రాజకీయం

విశాఖ జిల్లాలో అడ్డగోలు రాజకీయం తాండవం చేస్తోంది. ఐదేళ్లపాటు తమనెవ్వరూ తాకలేరన్న ధీమాతో ఇష్టారాజ్యంగా నేతలు వ్యవహరిస్తున్నారు. ఓటమి చెందినా అధికార పార్టీలోకి దూరిపోయి అక్రమాలతో చెలరేగిపోతున్నారు. అలాంటి వారిలో విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్. ఒకరు. డెయిరీలో ఏళ్లతరబడి పనిచేస్తున్న సుమారు 350 మంది కార్మికులను ఒక్క ఉదుటన డెయిరీ యాజమాన్యం తొలగించి వారిని రోడ్డున పడేసే నిర్ణయం తీసుకుంది. ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను హోల్‌సేల్‌గా తీసుకొచ్చి ఇక్కడ కార్మికుల పొట్టగొట్టే రాజకీయ వ్యూహాన్ని నేతలు అవలంబిస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులు సుమారు మూడు వేల మందిని ఈ రకంగానే అడ్డగోలుగా యాజమాన్యం తొలగించినా 'కూటమి' నేతలు మీనమేషాలు లెక్కిస్తుండడం కొనసాగుతోంది. గాజువాకలోని విశాఖ డెయిరీలో పనిచేస్తున్న



కార్మికులను తొలగించి కొత్తవారిని తెచ్చి పెట్టి పనిచేయించడంతో ఇటీవల రెండు రోజుల పాటు పాలు, పెరుగు పాడయ్యాయి. దీంతో వినియోగదారులు డెయిరీ ఉత్పత్తులకు నోచుకోలేకపోయారు. వ్యాపారంలో అక్రమాలను కప్పిపుచ్చుకోడానికే విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ బిజెపిలోకి చేరిపోయారన్న విమర్శలు ఉండనే ఉన్నాయి. తమను అన్యాయంగా తొలగించారంటూ తాజాగా విశాఖ నగరం నడిబొడ్డున జివిఎంసి గాంధీ బొమ్మ వద్ద డెయిరీ మహిళా కార్మికులంతా 24 గంటల నిరాహార దీక్షలు చేపట్టారు. తమను చట్టవిరుద్ధంగా తొలగించడంతో వారు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు.

కేంద్ర విధానాలతో అతలాకుతలం

గడచిన ఐదేళ్లుగా రాష్ట్రంలోనూ, పదేళ్ల నుంచి దేశంలోనూ బిజెపి అవలంబిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక, రాజకీయ విధానాల కారణంగా విశాఖను సమస్యలు చుట్టుముట్టాయి. బిజెపితో జతకట్టిన రాష్ట్రంలోని టిడిపి, జనసేన పార్టీలకు చెందిన అగ్రనాయకులు ఈ విధానాలకు తందానా అంటున్నారు. స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను తొలగించేస్తున్నా, డెయిరీ యాజమాన్యం అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా ఇవేవీ పట్టకుండా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు అన్ని అనుమతులూ ఇచ్చేయాలంటూ కూటమి నేతలు పదేపదే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

ఈ పరిస్థితుల్లో విశాఖ నగరంలోని ప్రధానమైన స్టీల్‌ప్లాంట్‌లో, విశాఖ డెయిరీలో కొద్ది నెలలుగా కార్మిక అశాంతి రేగుతూనే ఉంది. సిఐటియు ఆ రెండు చోట్ల కార్మికుల పక్షాన ఉండి పోరాడుతూ వారికి బాసటగా నిలుస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం, లేబర్ అధికారులను పలు దఫాలుగా కార్మికులు కలసి తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నా సరే పైనుంచి రాజకీయ నిర్ణయం మారకుండా తామేమీ చేయలేమన్న రీతిలో అధికారుల నుంచి సమాధానం వెలువడుతోంది.

ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడం దారుణం

ఉక్కు యాజమాన్యం తీరుపై సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అత్యంత ఘనంగా జరపాల్సిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యపూరితంగా, బాధ్యతా రహితంగా చేపట్టి అవమానపర్చిందని, ప్రొటోకాల్ నిబంధనలను ఉల్లంఘించిందని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో గంగారావు మాట్లాడుతూ త్యాగమూర్తులను స్మరించుకుంటూ, దేశభక్తి స్ఫూర్తితో జరపాల్సిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పట్టుమని పది నిమిషాలు కూడా నిర్వహించకుండా ఉద్దేశ్యపూర్వకంగా ప్లాంట్ యాజమాన్యం నీరుగార్చిందని తెలిపారు. నిర్దేశించి ప్రకటించిన సమయానికి కూడా జెండా ఎగురవేయలేదన్నారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి పరేడ్‌లో తిరిగి అభివాదం చేయాల్సిన ముఖ్య అతిథి పరేడ్ వందన కార్యక్రమం లేకుండా చేశారన్నారు. మార్చ్ ఫాస్ట్, క్యాడెట్ల కవాతులు లేవని, పరేడ్ వాహనం లేదని తెలిపారు. ఎంతో స్ఫూర్తిదాయకంగా పాడాల్సిన జాతీయ గీతాన్ని నీరుగార్చేశారన్నారు. అలంకరణ కూడా లేకుండా చేసి అత్యంత దయనీయమైన, విషాదకర వాతావరణాన్ని సృష్టించారని ఆవేదన వెలుబుచ్చారు. అన్ని నిబంధనలను బేఖాతరు చేశారన్నారు. స్వాతంత్ర్య వేడుకులను తిలకించడానికి వచ్చిన విద్యార్థులు, స్టీల్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు పరేడ్ గ్రౌండ్‌లో షామియానా టెంట్లు, కుర్చీలు, మంచినీరు వంటి ఏ ఒక్క సదుపాయమూ కల్పించలేదన్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఈ దుస్థితి నెలకొనడం ఎంతో ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రొటోకాల్ నిబంధనలు అన్నింటినీ ఉల్లంఘించి చివరికి ప్రజాప్రతినిధులను కూడా అవమానపరచారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిధిలో ఉన్న 77, 78 వార్డులకు చెందిన కార్పొరేటర్లకు ఆహ్వానాలు అందించలేదన్నారు. విశాఖ, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు, గాజువాక ఎమ్మెల్యేకు కూడా ఇదే పరిస్థితి దాపురించి ఉంటుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న కార్మిక సంఘాల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, ఒబిసి, ఆఫీసర్స్ అసోసియేషన్లకు వాట్సాప్‌లో ఆహ్వానాలు పంపి చేతులు దులుపుకున్నారన్నారు.

ఆఖరి మజిలీకి అష్టకష్టాలు

- అధ్వానంగా శ్మశాన వాటికలు
- షెడ్డులు, నీటి సదుపాయమూ కరువే...



ఎటువంటి సౌకర్యాలూ లేని బంటుపల్లి కల్లాలు శ్మశాన వాటిక

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కోనేటి వద్ద శ్మశాన వాటిక అధ్వాన్న పరిస్థితుల్లో ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం, ఎండాకాలంలో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. శ్మశాన వాటిక కొరత గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. శ్మశాన వాటిక చుట్టుపక్కల బహిరంగ మల విసర్జన జరగడం వల్ల దహన సంస్కారాలకు వచ్చే కుటుంబాలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాలకు తడుస్తూ, ఎండలకు వేడిని భరిస్తూ దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది. కనీసం కూర్చునే స్థలం, నీటి సదుపాయం లేక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. శ్మశాన వాటికలో షెడ్ నిర్మించాలని, నీటి సౌకర్యం కల్పించాలని, ప్రహరీ నిర్మించాలని వైసిపి బిసి సెల్ మండల అధ్యక్షుడు కోరాడ ఆదినారాయణకోరారు.

తర్లువాడ రుద్రభూమిలోనూ...

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని తర్లువాడ గ్రామ రుద్రభూమిలో మౌలిక సదుపాయాల ప్రాంతంలో కనీసం ఒక షెడ్, విద్యుత్, నీటి సదుపాయం లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని, వెంటనే అధికారులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని తర్లువాడ రుద్రభూమి

నేరాలు ఘోరాలు

ఉక్కునగరంలో చోరీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్ -6లోని 105 బి క్వార్టర్‌లో శనివారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఈ క్వార్టర్‌లో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డిజిఎం నల్లి సుందరరావు నివసిస్తున్నారు. కుటుంబీకులు శనివారం పనిమీద బయటకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. లోపలకు వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న 24 తులాల బంగారం చోరీకి గురైంది. నల్లి సుందరరావు కటుంబీకుల ఫిర్యాదు మేరకు క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. స్టీల్‌ప్లాంట్ స్టేషన్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యాన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టౌన్ షిప్‌లో తరచూ చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలు జరుగుతున్నాయని, ఇళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు.

లారీని ఢీకొట్టిన వ్యాన్

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ క్యాబిన్‌లో ఉండిపోవడంతో పోలీసులు అతన్ని బయటకు తీశారు. తుని నుంచి విశాఖపట్నం వెళ్తున్న సిలిండర్ లోడ్ వ్యాన్ నక్కపల్లిలో ఉపమాక ఆర్చి జంక్షన్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ సిహెచ్ కృష్ణ క్యాబిన్ లో ఇరుక్కుపోయాడు. స్థానిక పోలీసులు, హైవే స్టాప్ సంఘటన ప్రాతంతానికి చేరుకుని వ్యాన్ డ్రైవర్ ను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ స్వల్పంగా గాయపడగా, వ్యాన్ ముందుభాగం దెబ్బతింది. వ్యాన్ రోడ్డుపై నుండి తొలగించి, పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

కల్వర్టు నిర్మించరూ!

తాటి దూలంపై రాకపోకలకు ఇక్కట్లు

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని వేములవలస ఎస్‌సి, బిసి కాలనీలో కల్వర్టు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీలో 100 ఇళ్లు ఉండగా, గెడ్డవాగుకు చెరోవైపు సగంసగం ఇళ్లు ఉన్నాయి. అయితే వాగుపై కల్వర్టు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మమూలు రోజుల్లో వాగుపై తాటి దూలం వేసి ప్రమాదభరితంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఏమాత్రం తూలినా గెడ్డలో పడడం ఖాయమనే పరిస్థితుల్లో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం పడితే వీరి కష్టాలు చెప్పనలవికాదు. నాలుగున్నరేళ్లుగా పంచాయతీ పాలకమండలికి, అధికారులకు సమస్య పరిష్కరించాలని కోరినా స్పందన లేదని ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అంటున్నారు. ఇప్పటికైనా విశాఖ ఎంపీ శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ సహా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు.



కల్వర్టుపై రాకపోకలకు స్థానికులు వేసుకున్న తాటి దుంగ

ప్రాథమిక పాఠశాలగా యుపి పాఠశాల



ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మారిన భీమిలి యుపి పాఠశాల ఇదే

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరువలో ఉన్న జివిఎంసి ప్రాథమికోన్నత పాఠశాల ఇప్పుడు ఆదర్శ ప్రాథమిక పాఠశాల (మోడల్ ప్రైమరీ స్కూల్)గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలల హేతుబద్ధీకరణ పేరుతో ప్రాథమిక పాఠశాలలను వివిధ రకాలుగా విభజించిన నేపథ్యంలో స్థానిక యుపి పాఠశాలలో 1నుంచి 7 వరకు చదివిన విద్యార్థుల్లో 6,7 తరగతుల విద్యార్థులను జివిఎంసి పిఎన్‌ఎం హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్‌కు పంపించారు. ప్రస్తుతం ఇక్కడి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 64 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో యుపి పాఠశాలగా ఉన్న ఇదే పాఠశాలలో కేవలం 30 మంది విద్యార్థులే ఉండేవారు.

ఆదర్శ పాఠశాలల నిష్పత్తి ఇలా..

ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఇలా ఉండనుంది. 1 నుంచి 60 మంది విద్యార్థులు ఉంటే హెచ్‌ఎం, ముగ్గురు ఉపాధ్యాయులు ఉంటారు. 61 నుంచి 120 మంది విద్యార్థులుంటే హెచ్‌ఎం, నలుగురు ఉపాధ్యాయులు, 121 నుంచి 150 మంది విద్యార్థులుంటే హెచ్‌ఎం, ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారు.

5 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ..

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఇప్పటి వరకు 5 ప్రాథమిక పాఠశాలలు ఉండేవి. ప్రస్తుతం ఇవన్నీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మారాయి. భీమిలి రెండో వార్డు పాఠశాల, పిఎన్‌ఎం, సిఎంఇ, తగరపువలసలో విల్సన్ పేట, బంగ్లామెట్ట పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మారాయి.

ముగిసిన ఫుట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల "స్నిగ్ధ శ్రీదేవి ఫుట్‌బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్' పోటీలు శనివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో విశాఖ, ఎస్‌ఆర్‌కె ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విన్నర్స్‌గా, చిట్టివలస ఎస్‌పిఎం ఫుట్‌బాల్ క్లబ్ జట్టు రన్నర్స్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ చేతుల మీదుగా విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు, టోర్నమెంట్ బెస్ట్ ప్లేయర్‌కు రూ.5 వేలు, ఇతర బహుమతులు అందజేశారు. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులను సత్కరించారు. కలిగొట్ల స్నిగ్ధ శ్రీ జయంతి సందర్భంగా, ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె.సూర్యనారాయణమూర్తి, భానోజీ రావు, శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోటగిరి శ్రీధర్



పెద్దిపాలెంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

50 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలంలోని పెద్దిపాలెం ఎంపిపి స్కూల్ ప్రాంగణంలో ఓఎస్‌జి ఫౌండేషన్, శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన శనివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 50 మందికి పరీక్షలు జరగగా, 20 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని సోమవారం పెద్దిపాలెం నుండి ప్రత్యేక బస్సులో ఆసుపత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు ఓఎస్‌జి ఫౌండేషన్ నిర్వాహకులు శివ దళాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, క్యాంప్ కో-ఆర్డినేటర్ రాజు, శంకర్ ఫౌండేషన్ వైద్యబృందం, విద్యావేత్త బావిశెట్టి రాజు, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు సాయి జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

హద్దుల గందరగోళంతో ఇబ్బందులు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలంలో పంచాయతీ హద్దుల విషయంలో స్పష్టత లేక ప్రజలు అయోమయంలో పడుతున్నారు. ఆనందపురం పంచాయతీ నుంచి విడిపోయిన లోడగలవానిపాలెం పంచాయతీకి ఖచ్చితమైన సరిహద్దులు నిర్ధారించకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు పన్నులు ఎక్కడ చెల్లించాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. ఆనందపురం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 276లో గృహస్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. వీరికి ఆనందపురం పంచాయతీ పరిధిలోనే స్థలాలు కేటాయించినప్పటికీ, అవి లోడగలవానిపాలెం పంచాయతీ సరిహద్దుకు దగ్గరగా ఉండటంతో వివాదం తలెత్తింది. ఇదే సమస్య ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలోని జగనన్న ఇళ్ల స్థలాల విషయంలోనూ తలెత్తింది. పంచాయతీ హద్దులు ఖరారు చేయకపోవడంతో కాలనీ వాసులు ఇంటి పన్ను ఎక్కడ చెల్లించాలో తెలియక అయోమయంలో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే స్పందించి పంచాయతీ హద్దులను ఖరారు చేసి, ఆనందపురం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటి నుంచి ఖేల్ కూద్ పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విద్యాభారతి ఆధ్వర్యాన ఈ నెల 17వ తేదీ నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి ఖేల్ కుధ్ పేరుతో విశాలాక్షినగర్‌లోని పోలీస్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు భారతి విద్యా కేంద్రం చైర్మన్, ఎయు మాజీ వైస్ ఛాన్సలర్ గొల్లపల్లి నాగేశ్వరరావు తెలిపారు. విశాలాక్షి నగర్ బివికె జూనియర్ కళాశాల వాల్మీకి భవనంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నాగేశ్వరరావు ఈ ఆటల పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విద్యాభారతి పోటీల్లో విజేతలైన విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే క్రీడల్లో పాల్గొనడానికి అర్హులవుతారని తెలిపారు. భారతీయ విద్యా కేంద్రం కార్యదర్శి వేదనభట్ల రామ సత్యనారాయణ మాట్లాడుతూ, 36 ఏళ్లగా పాఠశాల స్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకు క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో 180 విద్యాలయాల నుండి 700 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్షేత్ర ఖేల్ కూద్ ప్రముఖ్ కెఆర్‌కె సత్యనారాయణ, ప్రాంత ఖేల్ కూద్ ప్రముఖ్ కెఎస్.చక్రవర్తి మాట్లాడుతూ, 6 7 8 తరగతి వారిని బాలల కేటగిరీగా, 9, 10 తరగతుల విద్యార్థులను కిషోర్ కేటగిరీగా, 11 12 తరగతులను తరుణ కేటగిరీగా విభజించి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, హ్యాండ్ బాల్, మాల్కంబ్, బాస్కెట్‌బాల్, చదరంగం, యోగా పోటీలు ఉంటాయని తెలిపారు.



కెవిపిఎస్ ఆధ్వర్యాన పాదయాత్ర చేస్తున్న ప్రజలు

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దు

ప్రజాశక్తి- వేపగుంట : అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించొద్దని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో 98వ వార్డు పరిధి అడవివరం దళిత కాలనీ, విజనగిరిపాలెం, దళిత, బిసి కాలనీల్లో శనివారం పాదయాత్ర నిర్వహించారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎంవి ప్రసాదరావు నాయకత్వాన ఇంటింటికీ కరపత్రాలు పంపణీ చేస్తూ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు సతమతమవుతున్నారని, ఇంకా ప్రజలపై భారాలు మోపొద్దని కోరారు. దళిత, గిరిజనులకు ఉచిత విద్యుత్ పథకాన్ని (జగ్జీవన్ జ్యోతి) కొనసాగించాలని డిమాండ్‌చేశారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న మాట్లాడుతూ, కాలనీల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వారి ఇళ్ల వద్ద పోస్టర్లను అతికించుకున్నారని తెలిపారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతామని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.శ్రీను, ఎం.సత్యారావు, కె.లక్ష్మి, పి.లక్ష్మి, ఎన్.ఎర్రిబాబు, ఎన్.సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బాలబాట మాసపత్రిక వార్షికోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : బాలల మాసపత్రిక బాలబాట 18వ వార్షికోత్సవాన్ని విశాఖ పౌర గ్రంథాలయంలో వైభవంగా నిర్వహించారు. రచయిత్రి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ బాల సాహిత్య పురస్కార గ్రహీత, బాలబాట పత్రికా సంపాదకులు కొల్లూరి స్వరాజ్యం వెంకట రమణమ్మ అధ్యక్షతన జరిగిన సభలో ఎన్.నాగేశ్వరరావు స్వాగతోపన్యాసం చేశారు. సంస్కతిని కాపాడేందుకు పట్టుదలతో ఈ పత్రిక నడుపుతున్నట్లు స్వరాజ్యం వెంకట రమణమ్మ తెలిపారు. జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, భావాలు ఖచ్చితంగా చెప్పాలంటే మాతృ భాష తప్పనిసరి అన్నారు. పత్రికను నడుపుతున్నందుకు స్వరాజ్యం వెంకట రమణమ్మను అభినందించారు. గౌరవ అతిథి డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, నేటి కాలంలో బాలసాహిత్యం మీద పుస్తకాలు తక్కువగాఉన్నాయన్నారు. పిల్లలకు పఠనాసక్తి కలిగించాలన్నారు. బాలబాట పత్రికకు పూర్ణకుంభ పురస్కారాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్తు తరుపున ప్రకటించారు. చందమామపై గజల్ పాడి వినిపించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డివి.సూర్యారావు మాట్లాడుతూ, పిల్లల్లో సంస్కృతిని పెంపొందించేందుకు బాల సాహిత్యం కావాలన్నారు. రచయిత, శ్రీశ్రీ కళా వేదిక విశాఖ అధ్యక్షులు కొలచిన రామ జగన్నాథ మాట్లాడుతూ, పిల్లల్లో పత్రికలు చదివే అలవాటు తగ్గడం బాధాకరమన్నారు. నైతిక విలువలు పెంపొందించే అవసరం ఉందన్నారు. సాహితీ ప్రియులు, ప్రముఖ న్యాయవాది, జర్నలిస్టు ఉప్పల అనిల్ కుమార్ మాట్లాడుతూ, భావ వ్యక్తీకరణకు మాతృభాష యుక్తమైనదని చెబుతూ నీతి కథను చెప్పారు. ఈ సభలో ద్వాదశి రామలక్ష్మి రచించిన "బాలగేయమాలిక" పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశాఖకు చెందిన యువ చిత్రకారుడు శశాంక, పలాసకు చెందిన కవి, రచయిత తెప్పల కృష్ణమూర్తిలను బాలబాట తరుపున సన్మానించారు. విద్యార్థులు చిద్విలాస్, భవ్యశ్రీ, జానుశ్రీ, అను, సాధ్విక పలు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు.

జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో మురుగునీరు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి జెఎన్ఎన్‌యుఆర్‌ఎం కాలనీ వాసులు తీవ్ర మురుగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. బ్లాక్ నెంబర్ 42 పరిధిలోని ఎఫ్6, ఎస్6, టి6 ఇళ్లలో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మ్యాన్‌హోల్ పూర్తిగా పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు బయటకు పోక, లోపలకు చేరుతోంది. కాలనీలోని అయ్యప్ప ఆలయం సమీపంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మురుగునీటి నిల్వతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. మురుగు నీరు ఇళ్లలోకి చేరడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మ్యాన్‌హోల్‌ను శుభ్రపరచి, మురుగు నీటి ప్రవాహానికి మార్గం కల్పించి, పారిశుధ్య పనులు నిర్వహించాలని కాలనీవాసులు శ్రీనివాస్, భవాని, లక్ష్మి తదితరులు విజ్ఞప్తి చేశారు.

ట్యాంకర్ల నీరే ఆధారం!

- ఆరిలోవలో అడుగంటిపోతోన్న బోర్లు
- రోజురోజుకూ తీవ్రమౌతున్న నీటిఎద్దడి
- అల్లాడిపోతున్న జనాలు



ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న ఆరిలోవ ప్రాంత వాసులు

ప్రజాశక్తి - ఆరిలోవ : వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొనడం సర్వసాదారణమైన, ఇపుడు వేసవి ముగిసి, వర్షాల సీజన్ వచ్చినా ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో మండు వేసవిని మించిన తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది. సామూహిక బోర్లతోపాటు నివాసాల్లోని వ్యక్తిగత బోర్లు సైతం అడుగంటి పోయాయి. దీంతో జివిఎంసి సరఫరా నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజు విడిచి రోజు జివిఎంసి సరఫరా చేసే నీరు చాలకపోవడంతో ఇప్పటికే చాలా మంది ప్రయివేటు నీటి ట్యాంకర్‌ల నుంచి నీటిని కొనుక్కొని, ఇళ్ళపై ఉన్న ట్యాంకులను నింపుకుని, తర్వాత వాడుకునే పరిస్థితి నెలకొంది.

ఈ ఏడాది వర్షాకాలంలో తగినంత వర్షాలు పడకపోవడం, వేసవిని మించిపోయేలా ఎండలు మండిపోతుండడం, ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి, గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని బోర్లు బోరు మంటున్నాయి.. వీటికి తోడు ఆరిలోవ ప్రాంతంలో హెల్త్ సిటీ రావడంతో ఆసుపత్రుల యాజమాన్యాలు పెద్ద బోర్లు వేయడం, బహుళ అంతస్తుల భవంతుల నిర్మాణాలు చేపట్టి, వాటిల్లోని నివాసితుల నీటి అవసరాలకు స్థాయికి మించిన బోరు పాయింట్లను వేయడం వంటి కారణాలు కూడా ఈ ప్రాంతంలో భూగర్భజల మట్టాలపై గణనీయమైన ప్రభావం చూపుతోందని నిపుణుఉలు అంటున్నారు. 30 ఏళ్ళ క్రితం ఈ ప్రాంతంలో 20 నుంచి 30 అడుగుల లోతుకే నీరు లభ్యమయ్యే పరిస్థితి నుంచి నేడు ఓపెన్ వెల్స్ వేసే నీరు పడని దుస్థితి ఉండగా, బోరు పాయింట్లయితే, ఇప్పుడు 250 నుంచి 300 అడుగుల వెళ్ళినా నీటి జాడ కనిపించని స్థితి ఉంది. కొన్ని ప్రాంతాల్లో 500 అడుగులు వెళ్ళినా జల జాడ కానరావడం లేదు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అద్దిళ్లలో ఉంటున్న వారు నీటి కొరతతో అల్లాడిపోతూ, ఇళ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారు. వర్షాలు పడి భూగర్భ జలాలు పెరిగితే గానీ సమస్య పరిష్కారం కాదని నిపుణులు అంటున్నారు. ఈనేపథ్యంలోజివిఎంసి నీటిసరఫరా విభాగం రోజువారీగా మరిన్ని ఎక్కువ ట్యాంకర్లు ద్వారా తాగునీటి సరఫరాను పెంచి, ఆరిలోవ ప్రాంతంలో ప్రజల దాహార్తిని తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక సంబరాలు

స్వాతంత్ర్య వేడుకల్లో దేశభక్తి గీతాలను ఆలపిస్తూ నృత్యాలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం

వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, ప్రజా నాట్యమండలి ఆధ్వర్యాన స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు దేశభక్తి గీతాలను ఆలపిస్తూ నృత్యాలు చేశారు.

ఉక్కునగరం : ఉక్కునగరంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చిన్నారులు ఆటపాటలతో అలరించారు. దేశభక్తి గీతాలను ఆలపిస్తూ నృత్యాలు ప్రదర్శించారు. యువతలో దేశభక్తి పెంపొందించాలని, చిన్నారులకు దేశ స్వాతంత్ర్యం గురించి అవగాహన కల్పించాలని ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అనాలోచితంగా ఉన్నాయన్నారు. స్థానిక ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయాన్ని గాలికి వదిలేసి నేటికీ పునాది కూడా వేయని మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలని కోరడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. విఆర్ఎస్ పేరుతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను తొలగించి, కాంట్రాక్టు వర్కర్లను తొలగించి ఏ విధంగా ప్లాంట్‌ను నడపుతారని ప్రశ్నించారు. విశాఖ విమల విద్యాలయం మూసివేయడం, సెంట్రల్ స్కూల్‌లో ప్రవేశాలు నిలిపేయడం దేనిని సూచిస్తుందని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంపై ఎంపీ, ఎమ్మెల్యేలు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా చేయడం దుర్మార్గమని, యాజమాన్యంపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరాం, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, ఎస్‌కె. మొహిద్దిన్, పుల్లారావు, ఐద్వా నాయకులు డి.వాణి, ఎం.విజయలక్ష్మి, ఎ.సూర్యప్రభ, ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ జాయింట్ సెక్రటరీ కె.సత్యనారాయణ, స్టీల్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పి.రాంబాబు, ఆర్.కృష్ణార్జున, సభ్యులు ఎ.కోటేశ్వరరావు, కెటియు.భాస్కర్, కె.అప్పారావు, ఎం.గౌరీశంకరరావు పాల్గొన్నారు.

గాజువాక : తోకాడ సమైఖ్య అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, విసిసి ఆధ్వర్యాన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకొని ఆటపాట కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం ఏ విధంగా పోరాటం చేసేమో ఆ విధంగానే నేడు దేశ రక్షణ కోసం పోరాడాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని పేర్కొన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ చేస్తున్న అరాచకాలను యువత తెలుసుకోవాలన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సభ అనంతరం అపార్ట్‌మెంట్‌లో ఉన్న పిల్లలు పాటలు పాడి డ్యాన్సులు చేశారు. క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ అంశాలపై పిల్లలు ప్రసంగాలు ఏర్పాటుచేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జి.రామన్న, కార్యదర్శి శ్రీనివాస్‌చౌదరి, నాయకులు శంకరరావు, మహిళా కమిటీ నాయకులు రమణి, శాంతి, రమ, పద్మ, మణి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా విసిసి ఆధ్వర్యాన పలు ట్యూషన్ సెంటర్లలో క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు శనివారం అక్కిరెడ్డిపాలెంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.రమేష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు విజ్ఞానంపై దృష్టి సారించాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, విసిసి నాయకులు పాల్గొన్నారు.



తోకాడ సమైఖ్య అపార్ట్‌మెంట్‌లో ఆటపాట కార్యక్రమంలో నృత్య ప్రదర్శనలిస్తున్న పిల్లలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రమేష్ కుమార్

ఆర్టీసీ బస్సుల్లేవు.. ఉచిత ప్రయాణం ఎలా?

- పరవాడ నుండి జిల్లా కేంద్రానికి ఒక్క సర్వీసూ నడపని వైనం
- తక్షణమే బస్సులు ఏర్పాటు చేయాలని మహిళల డిమాండ్

ప్రజాశక్తి-పరవాడ

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ ప్రభుత్వం స్త్రీ శక్తి పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించినా పరవాడ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల ప్రజలకు దాని ప్రయోజనం పొందలేని పరిస్థితి నెలకొంది. పరవాడ నుండి జిల్లా కేంద్రం అనకాపల్లికి ఆర్టీసీ యాజమాన్యం ఒక్క బస్సు కూడా నడకపోవడంతో తాము ఉచిత ప్రయాణం ఎలా చేయాలని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

అనకాపల్లి జిల్లా కేంద్రంగా జిల్లా ఏర్పడి మూడేళ్ళు గడుస్తున్నా, పారిశ్రామిక కేంద్రమైన పరవాడ నుండి అనకాపల్లికి ఒక్క బస్సు కూడా ఆర్టీసీ యాజమాన్యం నడపడం లేదు. ప్రతిరోజూ పరవాడ మండలం నుండి వందలాది మంది మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు జిల్లా కేంద్రంలోని కార్యాలయాలు, ఆసుపత్రులు, కోర్టులు, కళాశాలలకు వెళ్లి వస్తున్నారు. అలాగే మండలంలో ఫార్మాసిటీతో పాటు ఇతర పరిశ్రమల్లో పని చేసే మహిళా కార్మికులు ఇతర ప్రాంతాల నుండి పరవాడకు వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజా రవాణా అధికారులు పరవాడ మండల కేంద్రానికి ఒక్క బస్సు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఆటోలు, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది.

మహిళలకు అందని ఉచిత ప్రయాణ సౌకర్యం

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రకటించి అమలు చేస్తున్నప్పటికీ, పరవాడ మహిళలకు ఆ సౌకర్యం అందుబాటులో లేకుండా పోయింది. అలాగే ఇక్కడ పరిశ్రమల్లో పని చేసే మహిళా కార్మికులకు కూడా స్త్రీ శక్తి పథకం ప్రయోజనాలు దక్కకపోవడం దురదృష్టకరం.

మహిళలకు వ్యయ ప్రయాసలు

ఆర్టీసీ బస్సులుంటే మహిళలు ఉచితం ప్రయాణం చేయొచ్చు. కాని బస్సుల్లేకపోవడంతో పరవాడ నుండి అనకాపల్లి వెళ్లాలంటే ప్రజలు ఆటోలు, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఒక్కోసారి డబుల్ ఛార్జీలు వసూలు చేయడంతో పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది. మరో వైపు పరిమిత ఆటోలు, అధిక ఛార్జీల కారణంగా సమయానికి చేరుకోలేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

పరవాడ నుండి జిల్లా కేంద్రానికి బస్సులు నడపాలని కొత్త జిల్లాలు ఏర్పాటైనప్పటి నుండి అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, ప్రజా రవాణా అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. దీంతో ఇప్పుడు



అనకాపల్లి బస్ కాంప్లెక్స్

ప్రభుత్వ ఉచిత బస్సు ప్రయాణానికి కూడా నోచుకోని పరిస్థితి నెలకొంది.

తక్షణ చర్యలు తీసుకోకుంటే ఆందోళన

పరవాడ – అనకాపల్లి మధ్య వెంటనే నేరుగా బస్సులు నడపాలని, లేకపోతే ప్రజలు ఆందోళన తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు. బస్సులు తక్షణమే నడిపి తమ హక్కును కాపాడాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

డిపిటిఒ వివరణ

దీనిపై అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి (డిపిటిఒ) ప్రవీణాను ప్రజాశక్తి ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించి అనకాపల్లి నుండి పరవాడ మండలానికి బస్సు సౌకర్యం కల్పిస్తారా లేదా అని అడుగ్గా త్వరలోనే ఈ విషయంపై చర్చించి తగు విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.


అవార్డులు తీసుకున్న వికలాంగల విద్యార్థులతో డిఇఒ తదితరులు

మానసిక వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక అవార్డులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో జాతీయ స్థాయి స్పెషల్ ఒలంపిక్ క్రీడా పోటీల్లో గెలుపొందిన అనకాపల్లి జిల్లాకు చెందిన ముగ్గురు మానసిక వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక అవార్డులు అందజేశారు. రావికమతంకు చెందిన అప్పికొండ గణేష్, నక్కరాజు బాల సరస్వతి, అనకాపల్లికి చెందిన ధోని భాస్కర్‌లకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ చేతుల మీదుగా ఈ ప్రత్యేక అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, రమాదేవి , యేసురత్నంలను డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఆర్.జయప్రకాష్, జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి రామకృష్ణ అభినందించారు.


లింగన్న నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి శ్రేణులు

ఘనంగా లింగన్ననాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కోటవురట్ల : టిడిపి మండల అధ్యక్షులు లింగన్న నాయుడు జన్మదినం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. లింగన్న నాయుడు క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, వేచలపు జనార్ధన్, దేవవరపు సత్యనారాయణ, రాయవరం మండలం అధ్యక్షులు అబద్ధం, మండల జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, జానకి శ్రీనివాస్‌రావు, గుర్రం రామకృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని లింగన్న నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఖాజీపాలెం హైస్కూల్‌కు ఫర్నీచర్ వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఖాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, అంగన్వాడీ కేంద్రానికి టిడిపి మండల అధ్యక్షులు పీలా తులసీరాము, పి.సందీప్ తమ సొంత నిధులు లక్ష రూపాయలతో ఫర్నిచర్ సమకూర్చారు. గ్రామ పెద్దల సమక్షంలో హైస్కూల్ ఉపాధ్యాయులకు శనివారం అందజేశారు. హైస్కూల్ విద్యార్థులకు బెంచీలు, టేబుల్స్, కుర్చీలు, బీరువాలు, అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్లు అందజేశారు. హైస్కూల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సదుద్దేశంతో వీటిని అందించడం పట్ల గ్రామస్తులు అభినందిస్తున్నారు. హైస్కూల్ హెచ్ఎం శేషు, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఎం.భారతి పాల్గొన్నారు.

హైస్కూల్‌కు మైక్‌సెట్ అందజేత

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు వైభవ్ జ్యుయలర్స్ యజమానులు మైక్‌సెట్, సౌండ్ సిస్టమ్‌ను అందించారు. వారికి పాఠశాల హెచ్ఎం ఎస్వీ పద్మావతి కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ అసిస్టెంట్ బత్తి విజయలక్ష్మి ప్రోత్సాహంతో పాఠశాలకు ఈ మైక్ సెట్‌ను అందించినట్లు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వితరణ చేసిన మైక్ సెట్

ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు మృతి

- పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు బంధువుల యత్నం
- రూ.5 లక్షలు పరిహారం చెల్లింపునకు అంగీకారం


పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించిన బంధువులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ఆత్మహత్యకు పాల్పడి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని ఐతంపూడి గ్రామానికి చెందిన మచ్చకర్ల కృష్ణమూర్తి పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం... కృష్ణమూర్తి ఇటీవల ఓ చోరీ కేసులో అరెస్టయి రిమాండ్‌కు వెళ్లి తిరిగి వచ్చాడు. తాను ఏ తప్పు చేయకపోయినా చోరీ కేసులో అన్యాయంగా ఇరికించారని మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. తన చావుకు ఇద్దరు కానిస్టేబుళు , గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులే కారణమంటూ కృష్ణమూర్తి మరణ వాంగ్మూలంలో పేర్కొన్నాడు. కాగా మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం రాత్రి గ్రామానికి తీసుకొచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ దగ్గరకి చేరుకొని ఆందోళన చేయడానికి బయలుదేరారు. పోలీసులు వారిని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని శుక్రవారం రాత్రి 10 గంటల వరకు పోలీస్ స్టేషన్ ముట్టడించడానికి ప్రయత్నించడంతో భారీగా పోలీసులు మోహరించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయకపోతే దహన సంస్కారాలు నిర్వహించబోమని కుటుంబీకులు తెగేసి చెప్పారు. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామానికి చెందిన వ్యక్తులతో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పోలీసులు శనివారం ఉదయం చర్చలు చెప్పారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లించడానికి వారు అంగీకరించడంతో మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించారు.

ముగిసిన గ్రామీణ యువజన మందిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక గ్రామీణ యువజన మందిరం 61వ వార్షికోత్సవం శుక్రవారం రాత్రితో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ కళా ప్రదర్శనల కోసం నందీశ్వర కళా ప్రాంగణాన్ని ఇండోర్ స్టేడియంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. మరో అతిథి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో నాటక రంగానికి మునగపాక పెట్టింది పేరని, ఇక్కడ ఇంటికొక కళాకారుడు ఉండటంలో అతిశయోక్తి లేదని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ రంగస్థల నటులు దాడి ముసలి నాయుడును ఘనంగా సత్కరించారు. తరువాత మునగపాక ఐ కిడ్స్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ వారిచే కూచిపూడి, భరత నాట్యం, నటరాజ ఆర్ట్స్ వారిచే 'గీత దాటితే' నాటిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాలలో పలువురు రాజకీయ ప్రముఖులు, కళాకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు·


సీనియర్ కళాకారుడు ముసలినాయుడును సత్కరిస్తున్న దృశ్యం


నియామకం పత్రం చూపుతున్న శ్రీను తదితరులు

మత్స్యకార సంఘం మండల అధ్యక్షునిగా శ్రీను

ప్రజాశక్తి-పాయకరావుపేట

జాతీయ మత్స్యకార సంఘం పాయకరావుపేట మండల అధ్యక్షులుగా వెంకటనగరం పంచాయతీ, రాజానగరం గ్రామానికి చెందిన మత్స్యకార యువకుడు సూరాడ శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు తుని పట్టణంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు సూరాడ శ్రీనుకు నియామక పత్రం అందజేశారు. మండలంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా సూరాడ శ్రీనును మండలంలోని వివిధ మత్స్యకార సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధువులు, స్నేహితులు అభినందించారు. సంఘం ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా పిక్కి కొర్లయ్య, నక్కపల్లి మండల అధ్యక్షులుగా ఎరిపిల్లి అప్పలరాజును నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు తెలిపారు.

పిఎసిఎస్ చైర్మన్లకు సత్కారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని విజయరామరాజుపేట, బుచ్చయ్యపేట, బంగారుమెట్ట తురకలపూడి పిఎసిఎస్‌ల చైర్మన్లు కోట సత్యనారాయణ, దొండా శ్రీను, డొంకిన అప్పలనాయుడు, దొడ్డి కిషోర్‌లను, సభ్యులు పెదరెడ్ల శ్రీను శనివారం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఘనంగా సత్కరించారు. స్థానిక చెరకు కాటు వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ దాకారపు నాగేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.


చైర్మన్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

మహిళ హత్య కేసు విచారణ వేగవంతం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అనకాపల్లి - ఆనందపురం రోడ్డులో బాటజంగాలపాలెం పంచాయతీ రాజు గారి బంజరి వద్ద ఈనెల 14న లభ్యమైన హత్యకు గురైన గుర్తు తెలియని మహిళ కాల్చిన మృతదేహం కేసు విచారణ వేగవంతం చేసినట్లు స్థానిక సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ కేసులో పోలీసులు రెండు టీములుగా ఏర్పడి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఒడిస్సా రాష్ట్రంలో తప్పిపోయిన మహిళలు జాబితాను కూడా సేకరించామని, సుమారు 50 మంది మహిళలు తప్పినట్లుగా జాబితాలో ఉన్నట్లు ఆయన చెప్పారు. మన రాష్ట్రంలో 42 మంది మహిళలు తప్పిపోయినట్లుగా గుర్తించి ఆ జాబితాను కూడా తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 13న రాత్రి పెట్రోల్ బంకుల్లో ఎవరైనా బాటిల్స్ క్యాన్‌లలో పెట్రోల్ కొనుగోలు చేసిన వారిని కూడా గుర్తించి, వారిని కూడా ప్రశ్నించడం జరిగిందన్నారు. తమకు అనుమానం వచ్చిన వ్యక్తులను గుర్తించి వారిని కూడా ప్రశ్నించి విచారణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసు విచారణలో ఇంత వరకు ఎటువంటి ఆధారాలు తమకు దొరకలేదన్నారు. పోలీస్ సిబ్బంది పలు ప్రాంతాల్లోనూ, రాష్ట్రవ్యాప్తంగా విచారణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ మహిళ ఊహ చిత్రాన్ని సోషల్ మీడియాలో పెట్టి ఎవరైనా గుర్తిస్తే వారికి రూ.50 వేలు బహుమతి కూడా ఇస్తామని ప్రకటించామని ఆయన తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తింపు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం- పెందుర్తి రోడ్‌లో బొర్రమ్మ గెడ్డ వద్ద ఈనెల 15న శుక్రవారం లభ్యమైన గుర్తు తెలియని మృతుడు వివరాలు లభించినట్లు స్థానిక సిఐ జి.రామచంద్రరావు తెలిపారు. బొర్రమ్మ గెడ్డ వద్ద లభ్యమైన గుర్తు తెలియని మృతుడు ఈ నెల 12న రాత్రి గుల్లేపల్లిలో సంచరించినట్లుగా గ్రామస్తులు తెలిపారని, అదే రోజు అర్ధరాత్రి సబ్బవరం బర్మాజీ దాబాలో రాత్రి భోజనం చేసి ఉదయం వెళ్ళినట్లుగా కొంతమంది తెలిపారని పేర్కొన్నారు. 13న సూరెడ్డిపాలెం గ్రామంలో సంచరించినట్లుగా ఆ గ్రామానికి చెందిన పలువురు పోలీసులకు సమాచారం తెలిపినట్లు చెప్పారు. మృతుడు చేతి మీద అజయ్ అని పేరు పచ్చబొట్టుగా ఉన్నట్లు తెలిపారు. మృతుని వయసు 30 సంవత్సరాలు ఉంటాయని, ఆయనకు తెలుగు భాష రాదని, హిందీలో మాట్లాడతారని పేర్కొన్నారు. ఈ మేరకు మృతున్ని డిఎన్ఏ పరీక్ష కోసం మూడు రోజులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఉంచి, అనంతరం పోస్టుమార్టం చేసి అంత్యక్రియలు నిర్వహిస్తామని సిఐ తెలిపారు.

కొమ్మోజు రమేష్‌కు గౌరవ డాక్టరేట్



కొమ్మోజు రమేష్

ప్రజాశక్తి-అనకాపల్లి : సమాజానికి చేసిన విశేష సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ అనకాపల్లికి చెందిన కొమ్మోజు రమేష్‌కు 'హానరరీ డాక్టరేట్ ఆఫ్ సోషల్ సర్వీస్'ను ప్రకటించింది. ఈ మేరకు పుదుచ్చేరిలోని షెన్బాగా హాల్‌లో జరిగిన కాన్వొకేషన్‌లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.గోపికన్నన్, దక్షిణ భారత యుఎన్ఐపిసి చీఫ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.ప్రభు రాజేంద్రన్, జర్మనీకి చెందిన గ్లోబల్ అక్రిడిషన్ కౌన్సిల్ చీఫ్ మెంబెర్ డాక్టర్ జార్జ్ ఫ్రాయిండ్ పీటర్ చేతులమీదుగా కొమ్మోజు రమేష్‌కి ఈ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈ గౌరవం తన ఒక్కడిది మాత్రమే కాదు, ఆకర్ష్ కుటుంబం అంతటిది అని తెలిపారు. ఈ గౌరవ డాక్టరేట్ మరింత బాధ్యతను, మరింత కృషి చేయాలనే ఉత్సాహాన్ని ఇస్తుందని చెప్పారు.

ఏలేరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని అచ్చెర్ల గ్రామం వద్ద ఏలూరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న సిఐ ఎ.స్వామి నాయుడు, ఎస్సై పి.మనోజ్ కుమార్, సిబ్బం పడవలు, డ్రోన్ల సహాయంతో ఏలేరు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని బంగారయ్యపేట వద్దకు బయటకు తీశారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఇప్పటివరకు గుర్తింపు జరగలేదు. ఈ వ్యక్తి కేడి.పేట ప్రాంతానికి చెందిన గల్లంతైన వ్యక్తి కావచ్చుని, లేక మరొకరై ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఎవరైనా అదృశ్యమైన వ్యక్తి గురించి సమాచారం తెలిసిన వారు కశింకోట పోలీస్ స్టేషన్ ఫోన్ 94407 96088 సంప్రదించవలసిందిగా సీఐ కోరారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



నివాళులర్పిస్తున్న అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా అనకాపల్లి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారులు శ్రీదేవి, నారాయణరావు, కలెక్టర్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ ఇ.శ్రీనివాసులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఇన్స్పెక్టర్ టి.లక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్: భావిపౌరులందరూ సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ పిలుపునిచ్చారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా శనివారం గ్రీన్‌పార్క్ హోటల్ జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సర్దార్ గౌతు లచ్చన్న కుటుంబసభ్యులు యార్లగడ్డ వెంకన్న చౌదరి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ప్రొఫెసర్ వివేకానందమూర్తి, కేశాని వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు గుత్తుల మధుసూదనరావు, శ్రీశయన సంఘం సెక్రటరీ ఒమ్మిడి రమణ పాల్గొన్నారు.



విశాఖలో గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్



లోవరాజుకు కండువా వేసిన గున్నయ్యనాయుడు

వైసిపిలో చేరిన లోవరాజు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జమాదులపాలెం గ్రామంలో కశింకోట ఎంపిపి భర్త, సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు ఆధ్వర్యంలో శనివారం వైసిపిలో గూడుపు లోవరాజు చేశారు. లోవరాజుకు గున్నయ్య నాయడు కండువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కరక సోమునాయుడు, ఎంపీటీసీ సభ్యులు గూడుపు లక్ష్మీ రాజు, మాజీ ఉపసర్పంచ్ ఒమ్మి గంగునాయుడు, తీడ సర్పంచ్ చిరికి సత్యనారాయణ, బొట్ట నాగఅప్పారావు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి సిమెంట్ విరాళం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణానికి టిడిపి టౌన్ అధ్యక్షుడు దొండా నరేష్ శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం 40 సిమెంటు బస్తాలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా నరేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులను కురుందాసు మాలి బాబు, సింగంపల్లి రమేష్, కూటమి నేతలు ఎస్.మాధవరావు, ఎస్ఎంసి చైర్మన్ కోవెల వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ పేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని జివిఎంసి 84వ వార్డు గొల్లవీధిలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుడి విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపును మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో బోడి వెంకట్రావు, కోట్ని రామకృష్ణ, బొట్ట చిన్ని యాదవ్, కుప్పిలి జగన్ పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా ఉట్లను కొట్టి విద్యార్థులు ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. కృష్ణుడు, గోపికల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ, గుల్లేపల్లి, సింగన్నదొరపాలెం, ఆర్‌వై అగ్రహారం, సూదివలస తదితర గ్రామాల్లో పూజలు, అన్నదానం, ఉట్టికొట్టే కార్యక్రమాలు చేశారు. కె.కోటపాడు, గొల్లలపాలెం, పిండ్రంగి గ్రామాల్లో ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఈ వేడుకలు సందర్భంగా ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

కశింకోట : కసింకోట కోనేరు గట్టున గల శ్రీయశోదకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు భరిణికాన బాబురావు, భరణికాన నరసింహమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపికృష్ణ, మాజీ ఎంపీపీ పంచదార లక్ష్మి, మాజీ డిసిసిబి డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, సీఐ గొలగాని అప్పారావు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ గొల్లపేట గ్రామంలోని శ్రీకృష్ణ దేవాలయంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పెందర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుండ్రాపు వరలక్ష్మి సీతారామయ్య, వైసిపి నాయకలు కోన రామారావు, చుక్క రాము నాయుడు, పైల అప్పుల నాయుడు పాల్గొన్నారు.

మునగపాక : మునగపాక మండలం రాజుపేటలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ పాల్గొని, కృష్ణుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ రమాకూమారి, టిడిపి నేతల పెంటకోట విజయ్, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి, పెదనందిపల్లి, రైవాడ, బోయిలకింతడ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు రాధ, గోపాలకృష్ణ వేషధారణలో అలరించారు. మధ్యాహ్నం పలు గ్రామాల్లో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దేవరాపల్లి, పెదనందిపల్లి గ్రామాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పోతల పాత్రునాయుడు, పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు. బోయిల కింతాడలో కృష్ణుడి విగ్రహానికి తెలుగు రైతు నాయకులు కడిమి నాగేశ్వరరావు రూ.5000 విరాళంగా అందజేశారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం, మోసయ్యపేట, ఎం జగన్నాధపురం, కొండకర్ల గ్రామాలలోని కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆలయంలో పూజలు చేశారు. పలు చోట్ల అన్న సమరాధన ఏర్పాటు చేశారు.

సబ్బవరం : స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఉన్న స్థానిక శ్రీకృష్ణ మందిరంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్ల సంబరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జి, అదీప్ రాజు, మాడుగులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, వైసిపి నాయకులు గండి రవికుమార్, శాప్ డైరెక్టర్ పిబివిఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, ఎల్‌బిపీ అగ్రహారం గ్రామాల్లో జరిగిన వేడుకల్లో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం, పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, తవరాన దాసు, డొండా శ్రీను పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో పలు గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపమాక, వేంపాడు, మామిడివాని పాలెం, ఎన్.నరసాపురం, చినదొడ్డిగల్లు, గొడిచెర్ల, డిఎల్ పురం తదితర గ్రామాల్లో కృష్ణుని ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిట లాడాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేంపాడు గ్రామంలో ఉట్టి ఉత్సవాన్ని గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో కోలాట ప్రదర్శన చేపట్టారు.



విశాఖలో చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



మునగపాక మండలం రాజుపేటలో పాల్గొన్న సాయికృష్ణ

పెందుర్తి : పురుషోత్తపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చనలు, అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో అలరించారు. సాయంత్రం ఉట్టి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు చందూ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం (ఐఐఎం రోడ్డు) లోని హరేకృష్ణ వైకుంఠంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. బాలగోపాలునికి అభిషేకాలు చేశారు. ఉయ్యాల సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆటలు, క్విజ్ పోటీలు, ఉట్టి మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భక్త దాస్, అంబరీష్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : ఆర్ఎస్ ప్లే స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు విద్యార్థులకు వివరించారు. అనంతరం పూర్వ ప్రాథమిక విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికలు, కుచేలుడి వేశాధారణలో విచ్చేసి ఆట పాటలు, కోలాటాలు, డ్యాన్సులు వేసి సందడిచేశారు. విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది సునీత, శిరీష, సత్యవతి, అపర్ణ, జానకి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ ప్రారంభించారు. వెన్న చిలకడం, రాధాకృష్ణ ఉయ్యాల, బాలకృష్ణుని ఉయ్యాల, బృందావనం, గోవర్ధన గిరి, వసుదేవుడు, కృష్ణుడు, గోకులం, రేపల్లె, ఉట్టి కొట్టడం, శ్రీ కృష్ణుని వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి -మాడుగుల:ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు గ్రామాల అభివృద్ధి చేయడంలో శాయసక్తులా ప్రభుత్వం కృషి చేస్తుందని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మండలంలో వీరవిల్లి అగ్రహారం గ్రామంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్న సమయంలో కొన్ని వేల కోట్ల దుర్వినియోగం చేయడంతో రాష్ట్రం అప్పుల పాలు అయ్యిందన్నారు. దాని నుంచి తేరుకొని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక విధాలుగా ఆదాయ మార్గాలని ఎంచుకుంటున్నారని చెప్పారు. ఆర్థికంగా ఎన్ని కష్టాల్లో ఉన్నప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి నడిపిస్తారన్నారు. ముందుగా పిఎసిఎస్ అధ్యక్షుడు తలారి రమేష్ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకులు పైల ప్రసాద్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పెద్దేరు జలాశయ్య చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, బీరవెల్లి టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు పార్టీల నాగేశ్వరరావు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పిఎసిఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం



రోలుగుంటలో చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట పీఏసీఎస్ చైర్మన్‌గా సుర్ల బాబులునాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాబులునాయుడుతో పాటు యర్రంశెట్టి వెంకటరమణ, బుంగా అప్పారావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు చైర్మన్, డైరెక్టర్లను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఏసీఎస్‌ను అభివృద్ధి బాటలో నడిపించాలని, రైతులకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పంచాడ చంద్ర, నాయకులు సుర్ల రామకృష్ణ, జి.చంద్రమౌళి, బి.రాజు, పి.రాజు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం:

రావికమతం మండలంలో మూడు పిఎసిఎస్ చైర్మన్‌ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చినపాచిల కోపరేటివ్ సొసైటీ చైర్మన్ గా కోన పరదేశి నాయుడు, మేడవాడ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా గూటాల చిన్న, రావికమతం కోపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఉప్పునూరి నాగేశ్వరావు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చోడవరం శాసనసభ్యులు ఎస్ఎంఎస్ రాజు మాట్లాడుతూ, మూడు సొసైటీలను అభివృద్ధి పథంలో నడిపించుకొంటూ , రైతాంగానికి అందుబాటులో ఉంటూ, ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆయన కో రారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాజన్న కొండనాయుడు, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోమటి శంకర్రావు, జనసేన మండల్ పార్టీ అధ్యక్షుడు మైచర్ల నాయుడు, రావికమతం సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరావు, గల్లా రాజేశ్వరరావు, మచ్చా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మేడివాడ చైర్మన్ చిన్నాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజు



సిబ్బందిని సన్మానిస్తున్న సిఐటియు, యూనియన్ నేతలు

108 సిబ్బందికి సిఐటియు సత్కారం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: 108 ఫౌండేషన్ డే సందర్భంగా 108 సిబ్బందిని సిఐటియు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా స్టేట్ యూనియన్ ట్రెజరర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, 108 ఫౌండేషన్ స్థాపించి నేటికీ 20 సంవత్సరాలు అయిన సందర్భంగా సిబ్బందిని సత్కరించామన్నారు. సత్యం రామలింగ రాజు ఆపదలో ఉన్న ఎంతోమందికి సహాయం అందాలని ఉద్దేశంతో 108ని స్థాపించడం జరిగిందన్నారు. 108 ఎంతోమందికి ప్రాణదాతగా నిలిచిందని ఇందులో కీలక పాత్ర పోషించిన పైలట్, ఈఎంటి లను సత్కరించడం మన బాధ్యత అని తెలియజేశారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి 108 సిబ్బందిని సత్కరించారు.రిఫర్ కేసుల కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్మవ్యాధుల వైద్యులు వివేక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జిటిఎస్ ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

నేడు పోలీస్ స్టేషన్ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు ఈనెల 17న ఆదివారం ఉదయం హెూం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. హెటిరో డ్రగ్స్ కంపెనీ సిఎస్ఆర్ ఫండ్స్ తో స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా, పెట్రోల్ బంక్ పక్కన నూతనంగా పోలీస్ స్టేషన్ భవనం నిర్మించనున్నట్లు వెంకటేష్ వెల్లడించారు. భవన నిర్మాణానికి గుర్తించిన స్థలాన్ని చదును చేసి సిద్ధం చేశారు.



సిద్ధం చేసిన స్థలం



గర్నికం కస్తూర్బా విద్యాలయం

బోధన, క్రమశిక్షణలో ఉత్తమం

◆ ఫలితాల సాధనలో మేటిగా గర్నికం కస్తూర్బా విద్యాలయం

ప్రజాశక్తి- రావికమతం: క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, ఉత్తమ ఫలితాల సాధనలోనూ మండలంలోని గర్నికంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం ముందంజలో ఉంది. పూర్తిస్థాయి సిబ్బంది, అవసరమైన కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండడం, కెజిబివి నిర్వహణలో పాఠశాల విద్యాకమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తరచూ సమావేశమౌతూ సమస్యలపై చర్చిస్తూ, సమన్వయంతో పురోభివృద్ధి దిశగా సాగుతూ, ఇతర కస్తూర్బాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

జిల్లాలో ప్రతి మండలానికీ ఒక కస్తూర్బా విద్యాలయం ఉన్నప్పటికీ రావికమతం మండలం గర్నికం కెజిబివికి ప్రత్యేకమైన స్థానం ఉందనే చెప్పాలి. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని తరగతుల్లో పూర్తిస్థాయిలో 280మంది విద్యార్థులతో నిండి ఉంది. ఆహ్లాద కరమైన వాతావరణంలో విశాలమైన ఆటస్థలం, ఆడపిల్లల రక్షణకు ప్రహరీ, సరిపడా తరగతి గదులు, వసతి, మరుగుదొడ్లు, స్నానపు గదులు, డైనింగ్ హాలు,డార్మెటరీ, మీటింగ్ హాలు, లైబ్రరీ ఇలా అవసరమైన అన్ని సదుపాయాలు సమకూరి ఉన్న పాఠశాలగా గుర్తింపు పొందిది. క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యాబోధనకు 10వ తరగతి, ఇంటర్మీడియట్ అత్యుత్తమ ఫలితాలు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఉండడమే నిదర్శనంగా నిలుస్తోంది.

అసంపూర్తి గ్రంథాలయ భవనమే లోటుగా ఉన్నప్పటికీ, ఇటీవల అది కూడా ఇటీవలే నిర్మాణం పూర్తి చేసుకుంది. మరోవైపు మరింత మెరుగైన వసతి సౌకర్యం కోసం రూ.1.64కోట్ల సమగ్ర శిక్ష నిధులు మంజూరు కాగా, మూడు అంతస్తులు, ఆరు గదులతో భవన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. అ వి కూడా పూర్తయితే మరింత అదనపు వసతి సమకూరనుంది. ప్రభుత్వపరంగా సర్వేపల్లి విద్యామిత్ర కిట్లు పూర్తిస్థాయిలో అందించడంతోపాటు, నాణ్యమైన భోజన, వసతి సదుపాయాలు తమ పిల్లలను ఇదే పాఠశాలలో చేర్పించి చదివించేలా విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి కలిగించేలా చే స్తు న్నా యం టే అతిశయోక్తి కాదు. ఇక్కడ ప్రవేశాలకు ఉన్న డిమాండ్లు దీన్ని చెప్పకనే చెబుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని తరగతుల్లోనూ మరికొన్ని సీట్లు పెంచితే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానికులు కోరుకుంటు న్నారని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కొలిమల్ల జగన్నాథం అంటున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందితోపాటు విద్యార్థుల తల్లిదండ్రుల సమన్వయం, నేతలు, ఉన్నతాధికారుల సహకారంతో ఈ పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని జగన్నాథం అంటున్నారు.



నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు



దీక్ష చేస్తున్న దళిత రైతులు

25వ రోజుకు దళిత రైతుల దీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:మాకవరపాలెం మండలం జీ.కోడూరు రాయి క్వారీని రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని బీఎస్పీ కన్వీనర్ భొట్టా నాగరాజు అన్నారు. క్వారీని రద్దు చేయాలని కోరుతూ నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద దళిత రైతులు చేస్తున్న నిరసన కార్యక్రమం శనివారం నాటికి 25వ రోజుకు చేరాయి. గత 25 రోజులుగా దళిత రైతులకు న్యాయం చేయాలని నిరసనలు చేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. అక్కడున్న సహజ వనరులను, సంపదను, తాగునీరును కలుషితం చేసి ఆర్థికంగా డబ్బున్న ఒకరిద్దరికి దోచిపెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పీకర్ అయ్యన్నపాత్రుడు కలుగజేసుకొని దళిత రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు తాతబ్బాయి పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో మాజీ ప్రధాన మంత్రి ఆటల్ బిహారీ వాజపేయి వర్ధంతి వేడుకలను శనివారం బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాజపేయి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి రవిరాజు, కోసూరి శ్రీనివాస్,కె శివ ప్రకాష్, జ్యోతి కృష్ణ, బంగారు శివ, వెంకటేశ్వరావు, మునసాల నానాజీ పాల్గొన్నారు.

అధికారులకు అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకుంటున్న మోహనరావు, రాజు



హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మూర్తి, షణ్ముఖరావు, రాజేశ్వరరావు, రామారావు, పద్మజ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖలో పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆర్.షణ్ముఖరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్‌ఎన్ మూర్తికి విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు.

సబ్బవరం : సబ్బవరం మండలానికి చెందిన తహశీల్దారు బి.చిన్నకృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, సబ్బవరం పంచాయతీ ఈవో వైవి.రాజేశ్వరరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, అసిస్టెంట్ సర్వేయర్ సబ్బవరం-3 ఎస్.లోకేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె.ప్రవీణ్ కుమార్, పీహెచ్సీ ల్యాబ్ టెక్నీషియన్ వివివివి.పద్మావతి, ఫైర్‌మాన్ కె.మహేశ్వరరావు, అంతకాపల్లి సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ జి.దుర్గాప్రసాద్, సబ్బవరం ప్రభుత్వ బాలికల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బషీర్ మున్ని, అంబేద్కర్ గురుకులం ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు టి.రాంబాబు, రాయపురం అగ్రహారం సెక్రటరీ ప్రవీణ్, ఆరిపాక సెక్రటరీ పైడిరాజు, తవ్వవానిపాలెం సెక్రెటరీ వసంత, మొగలిపురం సెక్రెటరీ రజని, అంతకపల్లి సెక్రెటరీ అప్పారావు తదితరులు రాష్ట్ర మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ చేతులమీదుగా ఉత్తమ అవార్డులు అందకున్నారు.

పాయకరావుపేట : పాయకరావుపేట పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ మోహనరావు, హోం గార్డు రాజులకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. వారిని స్టేషన్ హౌస్ ఆఫీసర్ గంట్లాన అప్పన్న, ఎస్ఐలు జుత్తు పురుషోత్తం, ఎస్.సన్యాసిరావు, మహమ్మద్ అలీ, ఎఎస్ఐలు జెర్రిపోతుల గోవిందరావు, దాసరి నాయుడు బాబు, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

నర్సీపట్నం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా అనకాపల్లిలో హోం మంత్రి అనిత చేతుల మీదుగా తహసిల్దార్ లోకవరపు రామారావు అవార్డు అందుకున్నారు. గతంలో ఆయన మాకవరపాలెం ఇన్చార్జి తహసిల్దార్ గా చాలా కాలం పని చేశారు, స్వతహాగా ఆయన మృదు స్వభావి కావడంతో పాటు సమస్యలను పరిష్కరించడంతోపాటు సిబ్బందితో కూడా సామరస్యంగా ఉంటారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామారావును అధికారులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

సిఐటియు

ప్రజాశక్తి-జి.మాడుగుల:స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు హాజరై స్కీం వర్కర్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాదించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయాలని చూస్తోందన్నారు. దీంతో సంఘం పెట్టుకొనె అవకాశం, సమ్మె, పనిగంటలు, కనీస వేతనాలు వంటి హక్కులు కోల్పోతారన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. ఆశ, అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 వేలు రూ చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలన్నారు. వెలుగు వివోఎల మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు.ఆశా, అంగన్వాడీలు, వివోఎలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిస్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దీనబందు, మహేష్, మోధకొండమ్మ, అన్నపూర్ణ, సత్యవతి, రత్నకుమారి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాడేరు ఘాట్‌లో కురుస్తున్న వర్షం

పాడేరు ఘాట్‌లో విభిన్న వాతావరణం

-ఉదయం పొగమంచు..మధ్యాహ్నం భారీ వర్షం..

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గత కొన్ని రోజులుగా ఉదయం వేళల్లో పొగమంచు కమ్మేస్తుంది. మధ్యాహ్నం భారీ వర్షాలు కురుస్తోంది. పాడేరు ఘాటీలో శనివారం భిన్న వాతావర పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కాస్త ఎండ కాసింది. మధ్యాహ్నం పన్నెండు తర్వాత ఘాటీ సగం వరకు పొగమంచు కమ్మేసింది. ఒంటిగంట తర్వాత కుంభవృష్టిగా వాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీ వర్షం పడడంతో ఘాటీలో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించ లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు శనివారం కురిసిన భారీ వర్షానికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు కూలుతాయేమోనన్న భయంతో ప్రయాణం సాగించారు. ఎప్పుడు, ఎక్కడ చెట్టు కూలి రాకపోకలు నిలిచి పోతాయోనని వాహనదారులు ఆందోళన చెందారు.



కురుస్తున్న పొగ మంచు

అదాని హైడ్రో పవర్ ప్రాజెక్టు

అనుమతులు రద్దు చేయాలి

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి, మారిక మధ్యలో 900 మెగావాట్ల ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం చేయి తలపెట్టిన ప్రాంతాలను తమ సంఘం క్షుణ్ణంగా అధ్యయనం చేసిందని, దేవరాపల్లి, వేపాడ మండలాల్లో నివసిస్తున్న గిరిజనుల భూములు, వారి జీవనోపాధికి ఈ ప్రాజెక్టు పూర్తిగా నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 600 మెగావాట్లకు అనుమతి ఇవ్వగా, కూటమి ప్రభుత్వం దానిని 900 మెగావాడ్లకు పెంచి జూన్ 30వ తేదీన జిఒ 51 విడుదల చేసిందని, తక్షణమే ఆ జిఒను రద్దు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు వల్ల దేవరాపల్లి, వేపాడ మండలాల్లోని ఆదివాసీల జీవనం ఛిద్రం కానుందని, పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. మరో వైపు రైవాడ రిజర్వాయర్ కింద ఉన్న 15,344 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు, మహావిశాఖ నగరానికి తాగునీరు అందకుండా పోతుందని తెలిపారు. శారద నది పరివాహక ప్రాంతాలైన దేవరాపల్లి, చీడికాడ, చోడవరం, అనకాపల్లి, మునగపాక, యలమంచిలి, రాంబిల్లి మండలాల్లోని రైతుల సాగునీటి హక్కును హరిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టును గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, అధికారులు సర్వేలు చేయకుండా అడ్డుకున్నారని, నిరసలు, సభలు, సమవేశాలు నిర్వహించారని గుర్తు చేశారు. తక్షణమే ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయకుంటే ఆందోళన తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు.

పోలీసుల శ్రమదానం



చెత్త తొలగిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి : 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక శ్రమదానం నిర్వహించింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎస్‌బి ఇన్స్పెక్టర్ టి.లక్ష్మీ నాయకత్వంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యాలయ ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలాలు, రికార్డు గదులు, ఇతర విభాగాలను శుభ్రం చేశారు. చెత్త తొలగింపు, మొక్కల చుట్టూ కలుపు తీయడం, పరిసరాలను శుభ్రంగా ఉంచే చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.